# దీక్షా దివస్ చారిత్రాత్మకం



సిద్దిపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

- నవంబర్ 29 కేసీఆర్ దీక్ష ఫలితమే తెలంగాణ రాష్ట్ర సాకారం
- దీక్షా దివస్‌లో భాగంగా రక్తదాన శిబిరం
- రంగధాంపల్లి వద్ద అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, నవంబర్ 29 : 'నవంబర్ 29 దీక్షా దివస్ అనేది ఒక చారిత్రాత్మక దినం.. కేసీఆర్ ఒక ఉద్యమకారుడుగా కేసీఆర్ చచ్చుడో తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో దీక్షను చేపట్టిన రోజు' అని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం దీక్షా దివస్‌ను పురస్కరించుకుని పట్టణంలోని రంగధాంపల్లి అమరవీరుల స్థూపంవద్ద అమరులకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి నివాసంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ దీక్షకు వెళ్లేటప్పుడు నా శవయాత్ర లేదా తెలంగాణ జైత్రయాత్రని ఆమరణ దీక్షకు కూర్చున్న రోజు నవంబర్ 29 అన్నారు. ఈ దీక్షకు సిద్దిపేటలోని రంగధాంపల్లి చౌరస్తా వేదికైందన్నారు. కేసీఆర్ చేపట్టిన దీక్ష యావత్ తెలంగాణ ప్రజలను కదిలించిందన్నారు. తెలంగాణను సాధించిందన్నారు. నవంబర్ 29 చరిత్రను మలుపుతిప్పిన రోజు అన్నారు. కరీంనగర్ నుంచి సిద్దిపేటలోని దీక్ష స్థలికి కేసీఆర్ వస్తుంటే అనాటి సీమాంధ్ర పాలకులు అలుగునూరు వద్ద పోలీసులు మోహరించి అరెస్టు చేసి ఖమ్మం జైలుకు తరలించారన్నారు. అయినా కేసీఆర్ దీక్షను కొనసాగించారన్నారు. ఖమ్మం దవాఖానకు తీసుకెళ్లినా కేసీఆర్ తన దీక్షను కొనసాగించారని తెలిపారు. కేసీఆర్ ఆరోగ్యం క్షీణిస్తుంటే అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించినట్లు చెప్పారు. తన శరీరం సహకరించకున్నా దీక్షను కొనసాగించారన్నారు. కేసీఆర్ దీక్ష ఫలితంగా అనాటి కేంద్ర హోంమంత్రి చిదంబరం 2009 డిసెంబర్ 9న తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటన చేశారన్నారు. కేసీఆర్ దీక్ష చేయకపోతే ఈ రోజు తెలంగాణ వచ్చేది కాదన్నారు. మనం స్వేచ్ఛ వాయువులు పీల్చుకునే వాళ్లం కాదన్నారు. జయశంకర్ చెప్పిన ఉద్యమ ట్యాగ్‌లైన్ నీళ్లు, నిధులు, నియమాకాల కల నిజమయ్యేది కాదన్నారు. ఈ దీక్ష చరిత్ర పుటల్లో నిలిచిపోతుందన్నారు. దీక్షకు వేదికైన రంగధాంపల్లి వద్ద ఆచార్య జయశంకర్ చేతుల మీదుగా అమరవీరుల స్థూపం నిర్మించుకున్నామన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.



చింతమడకలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ శ్వేత

## నేడు చింతమడకకు సీఎం కేసీఆర్



- 13వ పోలింగ్ కేంద్రంలో ఓటేయనున్న సీఎం దంపతులు
- ఏర్పాట్లను పరిశీలించిన సీపీ శ్వేత

సిద్దిపేట రూరల్, నవంబర్ 29 : మండలంలోని చింతమడక గ్రామంలోని 13వ పోలింగ్ కేంద్రంలో సీఎం కేసీఆర్ దంపతులు గురువారం ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. బుధవారం సీపీ శ్వేత ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హెలిప్యాడ్, పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తుపై తగిన ఆదేశాలు ఇచ్చారు. ఓటు జాబితాలో సీఎం కేసీఆర్ సీరియల్ నం :158 కాగా, ఓటరు కార్డు సంఖ్య: ఎస్ఏజీ 0399691, సీఎం కేసీఆర్ సతీమణి కల్వకుంట్ల శోభారాణి సీరియల్ నం :159 ఓటరుకార్డు సంఖ్య :ఎస్ఏజీ0761676, ఇరువురి ఇంటినెం :3-37 సీఎం కేసీఆర్ రానుండడంతో గ్రామస్తుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది. చింతమడకలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ప్రాంతాన్ని మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు. కాగా సిద్దిపేటలోని భారత్ నగర్ అంబిటస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో హరీశ్‌రావు దంపతులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.




సీఎం కేసీఆర్ ఓటువేయనున్న పోలింగ్ కేంద్రం

# పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలతో బందోబస్తు
- 10డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా
- జిల్లాలో 12 చెక్‌పోస్టులు ఏర్పాటు

సిద్దిపేట అర్బన్, నవంబర్ 29 : జిల్లాలో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పోలీస్ అధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో మొత్తం 2,632 అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. 278 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పోలీసులు గుర్తించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ చేసి, ప్రతి పోలింగ్ కేంద్రాన్ని జియోట్యాగింగ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 10 డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

**2,632 మందితో బందోబస్తు..**

సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో మొత్తం 2,632 మంది అధికారులు, సిబ్బందితో ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సిద్దిపేట కమిషనరేట్‌కు చెందిన అధికారులు, సిబ్బంది, స్థానిక సాయుధ బలగాలు, జిల్లా హోంగార్డులు మొత్తం 985 మంది కాగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, హోంగార్డులు, రైల్వే పోలీసులు మొత్తం 850 ఉన్నారు. కేంద్ర బలగాలు సీఆర్‌పీఎఫ్, జార్ఖండ్ రాష్ట్రం ఆర్మ్‌డ్ ఫోర్స్, అధికారులు, సిబ్బంది 797 మంది ఉండగా.. మొత్తం 2,632 మందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీమ్‌లు 26, 12 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు, వీడియో సర్వైలెన్స్ టీమ్‌లు నియోజకవర్గానికి ఒకటి చొప్పున నాలుగు టీమ్‌లు ఏర్పాటు చేశారు. ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణకు 103 మొబైల్ పార్టీలు, 26 క్యూఆర్‌టీ, 6 స్ట్రైకింగ్ ఫోర్స్, 4 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌ను నియమించారు.

### ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



ప్రశాంతమైన వాతావరణంలో ఓటు వేయడానికి భద్రతా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రజలు, ఓటర్లు, ప్రజాప్రతినిధులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. సమస్యాత్మకమైన పోలింగ్ బూత్ ల్లో సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిది.

-ఎన్.శ్వేత, సిద్దిపేట పోలీస్ కమిషనర్

**జిల్లాలో 12 చెక్‌పోస్టులు ఏర్పాటు..**

కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సరిహద్దు పోలీస్ స్టేషన్ల పరిధిలో 12 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లు, చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. జిల్లాలో చిన్నకోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జక్కాపూర్, బెజ్జంకి పోలీస్ స్టేషన్ పరిధిలో దేవక్కపల్లి, ములుగు పోలీస్‌స్టేషన్ పరిధిలో వంటిమామిడి, భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో భూంపల్లి ఎక్స్‌రోడ్, బేగంపేట్ పోలీస్ స్టేషన్ ఎదురుగా, జగదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్ ఎదురుగా, మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లద్దునూర్, చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో ముస్త్యాల, జిల్లెల గడ్డ చౌరస్తా, అక్కన్నపేట శివారులో, హైదరాబాద్ రోడ్డులోని నాగుల బండ వద్ద మొత్తం 12 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించిన వారిపై 1,304 కేసులు నమోదు చేయడంతోపాటు 2,872మందిని బైండోవర్ చేశారు.

**జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు..**

జిల్లా పరిధిలో గ్రామాలు, పట్టణాలు, మండలాలు, పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డిసెంబర్ 1వ తేదీ సాయంత్రం 5 వరకు 144 సెక్షన్ అమలు చేయనున్నారు. ఎన్నికలకు సంబంధించిన ఏదైనా ఫిర్యాదు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1950కు కాల్ చేయాలని సూచించారు. ఎన్నికల నియమావళి ఎవరైనా ఉల్లంఘిస్తే, ఎన్నికల సమయంలో ఏ చిన్న సంఘటన జరిగినా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667100, స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667306 లేదా డయల్ 100 కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు.

## మార్కండేయ ఆలయంలో రుద్రాభిషేకం

సిద్దిపేట టౌన్, నవంబర్ 29 : మంత్రి హరీశ్‌రావు లక్షన్నర మెజార్టీతో గెలవాలని కోరుతూ సిద్దిపేట మార్కండేయ ఆలయంలో బీఆర్ఎస్ బీసీ సెల్ కో-ఆర్డినేటర్ ముదిగొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం రుద్రాభిషేకం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మట్లాడుతూ.. సిద్దిపేట నియోజకవర్గాన్ని హరీశ్‌రావు దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దారన్నారు.



రుద్రాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ బీసీ సెల్ నేత శ్రీనివాస్

# పోలింగ్‌కు సర్వం సిద్ధం

- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఈవీఎంలు, సిబ్బంది
- నియోజకవర్గంలో 273 పోలింగ్ కేంద్రాలు
- యువకుల కోసం డిగ్రీ కాలేజీలో.. దివ్యాంగులకు జడ్పీహెచ్ఎస్ ఇంద్రానగర్‌లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- మహిళ కోసం 6, మోడల్ పోలింగ్ 5 కేంద్రాలు

సిద్దిపేట, నవంబర్ 29 : అసెంబ్లీ పోలింగ్‌కు అంతా సిద్ధమైంది. సిద్దిపేట నియోజకవర్గంలో మొత్తం 2,33,733 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,15,546 మంది ఉండగా, మహిళ ఓటర్లు 1,18,317 మంది ఉన్నారు. ఇతరులు 70మంది ఓటర్లు ఉన్నారు. ఇందుకోసం 273 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ ఉదయం 7 గంటకు ప్రారంభమై సాయంత్రం 5 వరకు కొనసాగనున్నదని రిటర్నింగ్ అధికారి రమేశ్‌బాబు తెలిపారు. సిద్దిపేట అసెంబ్లీ బరిలో 21 మంది అభ్యర్థులతోపాటు నోటాతో కలుపుకుంటే 22 మంది ఉన్నారు. రెండు ఈవీఎంలను ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో 1ప్రిసైడింగ్ అధికారి, 1 ఏపీవో, 2 ఓపీవోలు, 2 పోలీస్ సిబ్బందిని నియమించారు. మొత్తం 1092 మంది సిబ్బంది, 546 మంది పోలీసులను నియమించారు. సిద్దిపేట నియోజకవర్గాన్ని 26 సెక్టార్లుగా విభజించి, అందులో ఒక సెక్టార్‌కు 1 సెక్టార్ ఆఫీసర్, 1 రూట్ ఆఫీసర్, పోలీస్ సిబ్బందిని నియమించారు. నియోజకవర్గంలో యువకుల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దివ్యాంగుల కోసం ఇంద్రనగర్ జడ్పీ పాఠశాలలో పోలింగ్ కేంద్రం, 5 మోడల్ పోలింగ్ కేంద్రాలు,

### సిద్దిపేటలో 273 పోలింగ్ కేంద్రాలు

సిద్దిపేట నియోజకవర్గంలో సిద్దిపేట పట్టణంతోపాటు 5 మండలాలు ఉన్నాయి. సిద్దిపేట పట్టణంలోపాటు అర్బన్ మండలంలో 140 పోలింగ్ కేంద్రాలు, చిన్నకోడూరులో 48, నంగునూరులో 37 నారాయణరావుపేటలో 20 సిద్దిపేట రూరల్‌లో 28 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

మహిళల కోసం 6 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.